క్లుప్తంగా

డ్రగ్స్‌కు బానిసలైతే మిగిలేది మనోవేదనే



అవగాహన సదస్సులో న్యాయమూర్తులు

కర్నూలు (లీగల్): డ్రగ్స్‌కు బానిసలైతే మనోవేదనే మిగులుతుందని, యువత సన్మార్గంలో నడవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటనాగ శ్రీనివాసరావు సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్య నివారణ దినోత్సవం సందర్భంగా పుల్లారెడ్డి డెంటల్ కాలేజీలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో జడ్జి సి.హెచ్.వెంకటనాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. డ్రగ్స్ మాఫియాలు విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని చెలరేగిపోతున్నాయన్నారు. వీటి నియంత్రణ ప్రభుత్వానికి పెనుసవాలుగా మారిందన్నారు. డ్రగ్స్ దుర్వినియోగం, అక్రమ రవాణా గురించి, మాదక ద్రవ్యాల వాడకం వలన వచ్చే దుష్ప్రభావాల గురించి శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు వెంకట హరినాథ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ ఎస్.మనోహర్, న్యాయవాది మురళీ మనోహర్ మాట్లాడారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి డెంటల్ కాలేజ్ ప్రిన్సిపాల్ వై.మురళీధర్‌రెడ్డి, డెంటల్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికెళ్లొద్దు

కర్నూలు(హాస్పిటల్): మత్తు పదార్థాల పట్ల యువత దూరంగా ఉండాలని జిల్లా మాస్ మీడియా అధికారి ఎం. ప్రమీలదేవి చెప్పారు. ప్రపంచ మాదక ద్రవ్యాల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం స్థానిక కోల్స్ కళాశాలలోని విద్యార్థులతో ఆమె మాట్లాడారు. ఇటీవల కాలంలో విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారని, దీనివల్ల శారీరక, మానసిక అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు గంగాధర్ పాల్గొన్నారు.

మహనీయుడు సాహు మహరాజ్

కర్నూలు(అర్బన్): దళిత బహుజనులకు ప్రజాస్వామిక తాత్విక పునాదుల మీద సామాజిక న్యాయం ఏర్పరచి ప్రజల రాజుగా నిలిచిపోయిన మహనీయులు సాహు మహరాజ్ అని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి అన్నారు. సోమవారం సాహు మహరాజ్ 149వ జయంతి సందర్భంగా స్థానిక కా ర్యాలయంలో ఆయన చిత్రపటానికి వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరితో కలిసి ఆమె పూలమాల వేసి నివాళి అర్పించా రు. కార్యక్రమంలో దూదేకుల మాబ్బీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పాఠ్యపుస్తకాలివ్వాలి

కర్నూలు(సెంట్రల్): ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కా ర్యదర్శి అబ్దుల్లా డిమాండ్ చేశారు. సోమ వారం కేవీఆర్, టౌన్ మోడల్ కాలేజీల విద్యార్థులతో ఆయా కాలేజీ నుంచి కలెక్టరేట్ వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. కా ర్యక్రమంలో నగర కార్యదర్శి సాయి, నాయకులు అమర్,నరసింహ, అబ్బు,భాస్కర్,మల్లేష్, యోగి, తేజ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ప్రభాకర్

కర్నూలు(హాస్పిటల్) : లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు అధ్యక్షుడిగా దామెర ప్రభాకర్ ఎన్నికయ్యారు. స్థానిక కెమిస్ట్ భవన్‌లో క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ హాజరయ్యారు. క్లబ్ ద్వారా పేదలకు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అనంతరం ప్రభాకర్‌తో పాటు కార్యదర్శిగా ఎన్నికైన లోకేష్, ట్రెజరర్ శ్రీకాంత్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ బాలమద్దయ్య, సభ్యులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

సిద్దిపేట అర్బన్: ఆస్తమాతో బాధపడుతున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. కర్నూలుకు చెందిన అనిమేల సతీష్‌శర్మ కుమారులు భరద్వాజ శర్మ(18), షణ్ముఖశర్మ గతేడాది నుంచి సిద్దిపేట అర్బన్ మండలం కృష్ణసాగర్‌లోని శ్రీ సదానంద వైదిక పాఠశాలలో కృష్ణయజుర్వేదం చదువుకుంటున్నారు. అయితే భరద్వాజశర్మ రెండేళ్లుగా ఆస్తమాతో బాధపడుతున్నాడు. చికిత్స తీసుకున్నా తగ్గలేదు. ఈక్రమంలో సోమవారం ఉదయం హాస్టల్‌లో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

న్యూజెర్సీలో ఆత్మీయ కలయిక

కర్నూలు సిటీ: జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ ఉత్తర అమెరికా 1984–88 బ్యాచ్ నుంచి 2017-21 బ్యాచ్ పూర్వ విద్యార్థులందరూ న్యూజెర్సీలోని ప్లెయిన్‌స్‌బోరోలో సమావేశమయ్యారు. ఆది, సోమవారాల్లో దాదాపు 150 మంది పూర్వ విద్యార్థులు స్నేహపూరిత వాతావరణంలో కలుసుకుని నాటి కాలేజీ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మొదటి రోజున జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ వ్యవస్థాపకులు నారాయణమ్మ, పుల్లారెడ్డి దంపతుల చిత్ర పటాలకు నివాళులర్పించారు. అనంతరం కాలేజీ పూర్వ విద్యార్థి నిర్మించిన 'గుర్తుకొస్తున్నాయి' అనే చిత్రం ప్రీమియర్ రిలీజ్ చేశారు. 1987-91 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు పుల్లారెడ్డి కాలేజీలో ఆధునిక సాంకేతిక ప్రయోగశాల ఏర్పాటుకు 60 వేల అమెరికా డాలర్లు ప్రకటించారు.

అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం

- అధికారులను ఆదేశించిన జేసీ నారపురెడ్డి మౌర్య



స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలను అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారాలు చూపాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావుతో కలిసి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వినతులకు సత్వర పరిష్కారం చూపాలన్నారు. ఇందుకోసం అర్జీదారుడితో స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి మాట్లాడితే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఎప్పటికప్పుడు అర్జీలను పరిష్కరిస్తే రీ ఓపెన్ కావన్నారు. ప్రతిరోజూ స్పందన అంశాలపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలన్నారు. కాగా, జూలై 1 నుంచి ఆగస్టు 1వ వరకు జరిగే జగనన్న సురక్ష పథకంలో సచివాలయాల పరిధిలో ప్రత్యేక క్యాంపులను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

స్పందన వినతుల్లో కొన్ని...

➡ మిట్టసోమాపురం గ్రామ సర్వే నంబర్ 62/జీలో 3.50 ఎకరాల భూమి ఉందని, అయితే పొరపాటున ఆ భూమి ఇతరుల పేరున ఆన్‌లైన అయిందని.. దానిని తొలగించాలని కోరుతూ నందవరం మండలం కనకవీడుకు చెందిన హరిజన బీదమ్మ విన్నవించారు.

➡ సర్వే నంబర్ 37/బీ2లో 60 సెంట్ల భూమి ఉందని, అయితే అది చుక్కల భూమి జాబితాలో ఉందని, దానిని తొలగించాలని కర్నూలు మండలం రుద్రవరానికి చెందిన డి.ఆదినారాయణ కోరారు.

➡ సర్వే నంబర్ 130/4లో 1.28 ఎకరాల భూమి ఉందని, అయితే ఆన్‌లైన్ కేవలం ఎకరం మాత్రమే నమోదైందని, మిగిలిన భూమిని కూడా నమోదు చేయాలని ఆస్పరి మండలం ముత్తుకూరుకు చెందిన కె.హనుమంతు అధికారులకు అర్జీ ఇచ్చారు.

➡ సర్వే నంబర్ 162/2లో 4.77 ఎకరాల భూమి పెద్దల నుంచి సంక్రమించిందని, దీనికి పట్టాదారు పుస్తకం మంజూరు చేయాలని మంత్రాలయం మండలం మంచాలకు చెందిన పి.హనుమతు కోరారు.

➡ స్విమ్మింగ్ కోచ్‌గా ఎ.నటరాజరావును నియమించాలని స్విమ్మింగ్ పుల్‌లో శిక్షణ పొందుతున్న పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు జేసీకి విన్నవించారు.

డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయండి

కర్నూలు (టౌన్): తమ కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్నామని, ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పార్థసారథినగర్‌కు చెందిన మహబూబ్ బాషా, మద్దూరునగర్‌కు చెందిన సత్యనారాయణరెడ్డి మునిసిపల్ అధికారులకు విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం జరిగింది. వివిధ కాలనీల వారు సమస్యలపై ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్‌ను కలిసి వినతులు అందజేశారు. నిర్ణీత వ్యవధిలో వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన అర్జీదారులకు హామీ ఇచ్చారు. స్పందనలో మున్సిపల్ ఎస్ఈ వేణుగోపాల్, డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

సమస్యలు ఇవే...

➡ సుంకేసుల రోడ్డు రైల్వే ట్రాక్ పక్కన వ్యర్థాలు డంప్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆప్రాంతంలో నివసించే నాగరాజు అధికారులకు విన్నవించారు.

➡ తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తొలగించాలని పాత క్రిష్ణానగర్‌కు చెందిన మల్లికార్జున అభ్యర్థించారు.

➡ రాజీవ్ గృహకల్ప హౌసింగ్ కాలనీ,డ్రైవర్స్ కాలనీల నుంచి మురుగునీరు నేరుగా తమకాలనీలోకి వస్తుందని రాయలసీమగ్రామీణబ్యాంకు ఎంప్లాయిస్ హౌసింగ్‌కాలనీకి చెందిన శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు.

➡ తమ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలని బుధవారపేటకు చెందిన హాజీ బాబా వినతిపత్రం అందజేశారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్

జీవనధార మెడికల్‌షాపులు సీజ్



అధికారులు సీజ్ చేసిన స్త్రీశక్తి పట్టణ మహిళా సమాఖ్య దుకాణం

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని రెండు జీవనధార మందుల దుకాణాలను సోమవారం ఆసుపత్రి అధికారులు సీజ్ చేశారు. ఈ నెల 15వ తేదీన జీవనధార మందుల దుకాణాల్లో జరుగుతున్న అక్రమాలపై 'కొనేది కొండంత..చూపేది గోరంత' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ విషయమై స్పందించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన విచారణ జరిపించారు. నిర్దేశించిన ధరలకంటే మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, మందులకు బిల్లులు ఇవ్వడం లేదని, జనరిక్ మందులు గాకుండా ఇతర మందులు విక్రయిస్తున్నారని, ఆసుపత్రికి ఇవ్వాల్సిన వాటా ఆదాయం సక్రమంగా చెల్లించడం లేదని, దుకాణాల కాలపరిమితి ముగిసిందని నోటీసులు జారీ చేసినా ఖాళీ చేయకుండా దుకాణాలు కొనసాగిస్తున్నారన్న విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో స్త్రీ శక్తి పట్టణ మహిళా సమాఖ్య, లిటిల్ రోజెస్ సంస్థలు నిర్వహిస్తున్న జీవనధార మందుల దుకాణాలను సీజ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

పకడ్బందీగా జగనన్న సురక్ష అమలు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు (సెంట్రల్) : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జగనన్న సురక్ష, హౌసింగ్ తదితర అంశాలపై జిల్లాస్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. వలంటీర్లు ఇంటింటికీ తప్పనిసరిగా వెళ్లి, వారి సమస్యల గురించి తెలుసుకోవాలన్నారు. ప్రజలకు అవసరమైన సేవలను టోకెన్లుగా నమోదు చేసి, వాటిని సచివాలయాల్లో సర్వీసెస్ రిక్వెస్ట్ రూపంలో జనరేట్ చేయాలని ఆదేశించారు. ఆదోని, ఆలూరు, ఆస్పరి, గూడూరు, హాలహర్వి, హొళగుంద, కోడుమూరు, మద్దికెర, మంత్రాలయం, నందవరం, ఓర్వకల్లు, పెద్దకడుబూరు, తుగ్గలి, వెల్దుర్తి, ఎమ్మిగనూరు మండలాలు తక్కువ స్థాయిలో టోకెన్లు నమోదు చేశారన్నారు. అందులో ఏ ఒక్కటి కూడా సర్వీసెస్ రిక్వెస్ట్ రూపంలో జనరేట్ చేయలేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీడీఓలు దృష్టి సారించాలన్నారు. సచివాలయాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమంలో పురోగతి సాధించాలన్నారు. వివిధ సర్వీసుల ద్వారా వచ్చిన నగదు మొత్తాన్ని బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలన్నారు. వైఎస్సార్ కల్యాణమస్తుకు సంబంధించి వెల్ఫేర్ అసిస్టెంట్ల లాగిన్‌లో పెండింగ్ ఉన్న వాటిని పూర్తి చేయాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి స్టేజ్ కన్వర్షన్‌లో కౌతాళం మండలం గుడికంబాలి, ఎరిగేరి సచివాలయాల్లో గత వారం రోజుల నుంచి జీరో పురోగతి ఉందని కలెక్టర్ ఎంపీడీఓ, ఇంజినీరింగ్ అసిస్టెంట్, హౌసింగ్ ఇంజినీర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణాల కోసం ఎవరైనా లబ్ధిదారుల నుంచి నగదు తీసుకున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి హామీ పనుల్లో కూలీలు సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డులను ఈనెల 30వ తేదీ లోపు మండలాల వ్యవసాయ అధికారులు గుర్తించి కౌలు రైతులకు అందజేయాలన్నారు. వీఆర్వోలు, వీఏఏలు గ్రామ సభలు నిర్వహించి భూ యజమానులకు, కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డ్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లాస్థాయి అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

కార్మికులకు నాణ్యమైన యూనిఫామ్ ఇవ్వాలి

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు నాణ్యమైన యూనిఫామ్ దుస్తులు పంపిణీ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట ఆ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులగం మద్దిలేటి, చంద్రశేఖర్, రామాంజనేయులు , దేవసహాయం, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్వ్యూలు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూలు సోమవారం సాయంత్రం ముగిశాయి. సచివాలయాల్లో 23 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వలంటీర్ పోస్టుల కోసం నిరుద్యోగ అభ్యర్థులు 170 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూలకు 123 మంది హాజరయ్యారు. నగర పాలక ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్ ఈ ఇంటర్వ్యూలను పర్యవేక్షించారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

కర్నూలు (న్యూసిటీ) : ఎవరైనా అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. కొంత మంది లీజ్‌దారులు అనుమతికి మించి మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు తెలిసిందని, నిర్ధారణ అయితే లైసెన్స్ రద్దుతో ఆపటు భారీ జరిమానా విధిస్తామన్నారు.

కాంగ్రెస్‌లో సమన్వయ కమిటీల నియామకం

కర్నూలు(రూరల్) : జిల్లాలోని నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీలను డీసీసీ అధ్యక్షుడు సుధాకర్ బాబు సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా సుధాకర్ బాబు మాట్లాడుతూ నూతన సమన్వయ కమిటీల ద్వారా పార్టీ బలోపేతమవుతుందన్నారు.

పెంచిన కరెంటు చార్జీలను తగ్గించాలి

కర్నూలు (రూరల్): సర్దుబాటు పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ సోమవారం ఓ సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కర్నూలు(సెంట్రల్) : గోనెగండ్ల మండలం గంజహల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలిక అత్యాచార యత్నం కేసులో నిందితులపై కేసు నమోదు చేయాలని భరీరథ ఉప్పర/నగర సంఘం జిల్లా అధ్యక్షుడు యు.రాముడు డిమాండ్ చేశారు. సోమవారం ఉప్పర సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉప్పర బాలికపైన అత్యాచార యత్నం చేసిన నిందితుడితోపాటు అందుకు సహకరించిన మరో ముగ్గురిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏపీ ఈరన్న , యూశే వీరేంద్ర, శ్రీధర్, నాగేష్, టీవీ శివన్న, కుమార్, సత్యన్న నాగమణి, కిష్టప్ప, బీమరాజు, వీరేష్ పాల్గొన్నారు.

సభలను జయప్రదం చేయండి

కర్నూలు (రూరల్): నంద్యాలలో ఆగస్టు 26 నుంచి 29 వరకు జరిగే ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జయలక్ష్మి, దుర్గా భవాని పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా స్థాయి విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు సుగుణమ్మ, నగర అధ్యక్ష, కార్యదర్శులు శ్రావణి, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఈ– శ్రామ్ ఉంటే ప్రభుత్వ పథకాలు

కర్నూలు(రాజ్‌విహార్): అసంఘటిత కార్మికులకు ఈ శ్రామ్ గుర్తింపు ఉంటే ప్రభుత్వ పథకాలు అందించేందుకు సులువుగా ఉంటుందని కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కేశన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న ప్రతి అసంఘటిత కార్మికుడు/ కార్మికురాలు సమీపంలోని సచివాలయాల్లో, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని కార్డులు పొందాలని సూచించారు.

కబడ్డీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడి నియామకం

కర్నూలు(రూరల్) : కబడ్డీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కేఈ జగదీష్ ఎన్నికయ్యారు. ఆదివారం బాపట్లలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో కర్నూలు జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా చేసిన సేవలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను అప్పగించారన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



గౌతం రాజును అభినందిస్తున్న క్రీడాకారులు

కర్నూలు(రూరల్) : అంతర్జాతీయ స్థాయిలో ఈనెల 22 నుంచి 24 వరకు జపాన్‌లో జరిగిన అండర్–18 సాఫ్ట్‌బాల్ పోటీల్లో కర్నూలు నగరానికి చెందిన క్రీడాకారుడు గౌతం రాజు ప్రతిభ కనబరిచారు. సోమవారం కర్నూలు నగరానికి విచ్చేసిన ఆ క్రీడాకారుడికి స్థానిక క్రీడాకారులు, కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు.

'కుష్టు' లక్షణాలుంటే చెప్పండి

కర్నూలు(హాస్పిటల్): కుష్టు వ్యాధి లక్షణాలు ఉంటే ఇంటి వద్దకు వచ్చే వైద్య సిబ్బందికి తెలియజేయాలని జిల్లా ఎయిడ్స్, లెప్రసి, క్షయ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ చెప్పారు. సోమవారం స్థానిక ఇల్లూరునగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ కుష్టు నివారణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుంచి జూలై 16వ తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఇంటింటా సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యాధి మైకో బ్యాక్టీరియం అనే సూక్ష్మక్రిమి వల్ల వస్తుందని, ఈ క్రిములు తుమ్మడం, దగ్గడం వల్ల వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా నిర్మూలించవచ్చన్నారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, రాగి, ఎరుపు రంగు మచ్చలు, మందమైన జిడ్డు చర్మం , కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం




మాట్లాడుతున్న డాక్టర్ భాస్కర్

, చెవులపై, ఛాతిపై వీపుపై నొప్పిలేని బుడిపెలు, ముక్కు దిబ్బడ, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, అరిచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, చేతి వేళ్లు, కాలి వేళ్ల వంకర్లు తిరిగి అంగవైకల్యం ఏర్పడటం వంటి లక్షణాలు ఈ వ్యాధిలో కనిపిస్తాయన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ జి. మల్లికార్జునరెడ్డి, డాక్టర్ శ్రీదేవి, ఇల్లూరు నగర్ మెడికల్ ఆఫీసర్ ఓఎస్.శివశంకర్, డిప్యూటీ హెచ్ఈఓ ఎస్. దేవప్రసాద్, ఫిజియోథెరపిస్టు బి.రెడ్డిబాబు, డీపీఎంఓ గోవిందరావుజులు పాల్గొన్నారు.

నన్నూరులో ఫ్లైఓవర్ నిర్మించాలి

కర్నూలు(సెంట్రల్): రోడ్డు ప్రమాదాల నివారణకు కర్నూలు–కడప జాతీయ రహదారిలోని నన్నూరు సమీపంలో ఫుట్ వే బ్రిడ్జి స్థానంలో ఫ్లైఓవర్ లేదా అండర్ బ్రిడ్జిని నిర్మించాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నన్నూరు సమీపంలో జాతీయ రహదారి దాటేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, కొందరు ప్రమాదాల బారిన పడి ప్రాణాలను కోల్పోగా మరికొందరు గాయాలపాలయ్యారన్నారు. ఈనేపథ్యంలో అక్కడ ఫ్లైఓవర్ లేదా అండర్ బ్రిడ్జిని నిర్మించాలని ప్రజలు కోరుతుంటూ నేషనల్ అథారిటీ



డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వారు ఫుట్ వే బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారన్నారు. దీనివల్ల ఎలాంటి ఉపయోగంలేదని వారు వాపోయారు. అనంతరం డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, మల్లేష్, సలాంబాషా, ఆంజనేయులు, సంజీవ, దస్తగిరి, దానమయ్య పాల్గొన్నారు.

విన్నపాలు

గోరక్షణ చట్టం అమలు చేయాలి

కర్నూలు కల్చరల్: గోరక్షణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని వీహెచ్‌పీ, బజరంగ్ దల్ నాయకులు జిల్లా అధికారులను కోరారు. సోమవారం స్పందనలో జేసీ నారపురెడ్డి మౌర్య, ఎస్పీ కృష్ణకాంత్‌కు వినతి పత్రాలు ఇచ్చారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ మాట్లాడుతూ బక్రీద్ పండుగ పేరుతో విచ్చలవిడిగా గోవులను తరలించకుండా అధికారులు అడ్డుకోవాలన్నారు.

కేజీబీవీల్లో సీట్లు పెంచాలి

కర్నూలు సిటీ: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో డిమాండ్ మేరకు సీట్లు పెంచాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి అధ్యక్షుడు రవికుమార్ కోరారు. సోమవారం సమగ్ర శిక్ష కార్యాలయంలో ఎస్ఎస్ఏ అదనపు కో–ఆర్డినేటర్ డా.కె వేణుగోపాల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

ఈ రోజు

పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ వద్ద విద్యుత్ స్తంభాల మార్పు పనుల కోసం సరఫరా నిలిపివేయాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్ కోరడంతో ఆ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కోతలు విధిస్తున్నామని తెలిపారు.

సంపర్క్ అభియాన్ బహిరంగ సభ

కర్నూలు కల్చరల్: నంద్యాల జిల్లా మహాజన్ సంపర్క్ అభియాన్ బహిరంగ సభ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు సంతోష్‌నగర్‌లోని కర్నూలు కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నట్లు బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరెడ్డి శబరి పేర్కొన్నారు. సోమవారం కర్నూలు కన్వెన్షన్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

స్టాఫ్ సెలెక్షన్ పరీక్షలు

కర్నూలు(సెంట్రల్) : మూడు రోజులపాటు జరిగే స్టాఫ్ సెలక్షన్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లాకోర్డినేటర్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలులోని సనత్ నగర్ నియాన్ డిజిటల్‌ను పరీక్షా కేంద్రంగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

మన పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

- గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక 13వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బంగారుపేట, కేఈ మాదన్న నగర్ ప్రాంతాల్లోని వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం వారికి మంజూరు చేసిన సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేశారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టిన పాపాయి నుంచి వృద్ధాప్యంలో ఉన్న అవ్వాతాతల వరకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ మంచి చేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఇందులో భాగంగానే సంక్షేమ క్యాలెండర్ రూపొందించి అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. గత పాలకులు ఎన్నికల్లో హామీలు ఇచ్చి విస్మరించేవారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన నాలుగేళ్ల పాలనలోనే ప్రతి హామీని అమలు చేశారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయలక్ష్మి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు పరికరాలు ఇవ్వండి

కర్నూలు(అగ్రికల్చర్): రైతులకు వ్యక్తిగతంగా వ్యవసాయ పరికరాలు ఇవ్వాలని వ్యవసాయ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, ఆ శాఖ కమిషనర్ హరికిరణ్‌ను జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి కోరారు. సోమవారం గుంటూరులో అన్ని జిల్లాల వ్యవసాయ సలహా మండళ్ల చైర్మన్లతో మంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా చైర్మన్ పలు సమస్యలను మంత్రి, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కావేరి–జాదు పత్తి విత్తనాలతో రైతులు నష్టపోయి రెండేళ్లు గడుస్తున్నా తగిన పరిహారం అందలేదని, తగిన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. నర్సరీల చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని మెమోరాండం సమర్పించారు.



వ్యవసాయ మంత్రిని సత్కరిస్తున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి

బిల్లుల వసూలులో లక్ష్యం చేరాలి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లుల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి అన్నారు. సోమవారం ఆయన విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నెలవారి బిల్లులు 100 శాతం రాబట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దీనిపై ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఏఈలు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకుని లక్ష్యం చేరాలన్నారు.

24 బైక్‌లు సీజ్

కర్నూలు : నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు సోమవారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మైనర్లు నడుపుతున్న 24 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో రాజ్‌విహార్, సీక్యాంప్ సెంటర్, ఓల్డ్ ఈద్గా, ఫైవ్ రోడ్ జంక్షన్ ప్రాంతాల్లో లైసెన్స్ లేకుండా వాహనాలపై త్రిబుల్ రైడింగ్ వెళ్తున్న మైనర్లను అదుపులోకి తీసుకుని రూ.48,840 జరిమానా విధించారు. సాయంత్రం వారి తల్లిదండ్రులను పిలిపించి మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.